
# ఆర్టీసీకి
# మహాలక్ష్మీ కళ!



**హనుమకొండ -నవభూమి:** హనుమకొండ బస్టాండులో ప్రయాణికుల రద్దీ ప్రభుత్వం అమలు చేసిన ఆర్టీసీ మహాలక్ష్మి పథకానికి వరంగల్ రీజియన్‌లో అనూహ్య స్పందన లభిస్తోంది.గతం కంటే ప్రయాణించే వారి సంఖ్య రెట్టింపైంది.. ఉచిత ప్రయాణ సౌకర్యం రావడంతో మహిళలు ఉపాధి పనులు, శుభకార్యాలు, పుణ్యక్షేత్రాల సందర్శనలు, నిత్యావసర సరకుల కొనుగోలు, ఆసుపత్రులకు వెళ్లేందుకు సద్వినియోగం చేసుకుంటున్నారు. వరంగల్ రీజియన్‌లోని తొమ్మిది డిపోల పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు నిత్యం కిటకిటలాడుతున్నాయి. ప్రతి 100 మంది ప్రయాణికుల్లో 69 మంది మహిళలే ఉంటున్నారు. రీజియన్ పరిధిలో తొమ్మిది నెలల్లో 10.99 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా అందులో 6.95 కోట్ల మంది మహిళా ప్రయాణికులే ఉన్నారు.హనుమకొండ సిటీ బస్సుల్లో అత్యధికం ఉమ్మడి జిల్లాలో తొమ్మిది డిపోల పరిధిలో మొత్తం 10.99 కోట్ల మంది ప్రయాణించగా.. హనుమకొండ డిపో పరిధిలో అత్యధికంగా 1.97 కోట్ల మంది ప్రయాణించారు. అందులో 1.35 కోట్ల మంది మహిళా ప్రయాణికులే ఉన్నారు. 68.39 శాతం వారే..నగర పరిధిలోని 16 రూట్లలో ఇప్పటివరకు 17 లక్షల మంది రాకపోకలు సాగించగా అందులో మహిళా ప్రయాణికులు 8 లక్షల మంది ఉన్నారు.అతి తక్కువగా వరంగల్-2 డిపో పరిధిలో మొత్తం 1.02 కోట్ల మంది ప్రయాణించగా అందులో 55లక్షల మంది మహిళలు ఉన్నారు. 54.07 శాతం..మహాలక్ష్మీ పథకం రాకముందు రీజియన్‌లో 70 శాతం ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) ఉండగా మహాలక్ష్మీ పథకం వచ్చాక 120 శాతానికి పెరిగింది.పథకం ప్రారంభమైనప్పటి నుంచి హనుమకొండ డిపోలో 1.35 కోట్లు, వరంగల్-1 డిపోలో 61 లక్షలు, వరంగల్-2లో 55 లక్షలు, పరకాల 70 లక్షలు, భూపాలపల్లి 62 లక్షలు, జనగామ 1.06 కోట్లు, మహబూబాబాద్ 60 లక్షలు, నర్సంపేట 78 లక్షలు, తొర్రూరులో 69 లక్షల మంది మహిళలు ప్రయాణించారు.హనుమకొండ డిపో పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు, నగర, సిటీ బస్సులతో పాటు హైదరాబాద్, భూపాలపల్లి, కాళేశ్వరం, నర్సంపేట, జనగామ, సిద్దిపేట, కరీంనగర్ తదితర రూట్లలో మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారు.రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు..విజయభాను, ఆర్ఎం, వరంగల్ రీజియన్ రీజియన్‌లో ప్రతి 10 మంది ప్రయాణికుల్లో ఆరుగురు మహిళలే ఉంటున్నారు. కొత్త బస్సులకు ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే కొన్ని డిపోలకు చేరుతున్నాయి. ఎలక్ట్రికల్ బస్సులు సైతం రానున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా నడిపిస్తున్నాం. రోజురోజుకు ఓఆర్ శాతం పెరుగుతోంది.

# నవభూమి వరంగల్

అనుబంధం

17 సెప్టెంబర్,2024 మంగళవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


# ఐదు పాఠశాలలు..ప్రాంగణం ఒక్కటే



**ములుగు, -నవభూమి:** ములుగు జిల్లా కేంద్రంలోని ఒకే ప్రాంగణంలో ఐదు పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మూడు ఉన్నత, ఒకటి ప్రాథమికోన్నత, మరొకటి ప్రాథమిక పాఠశాల ఉంది.ఐదు బడుల్లో మొత్తం 352 మంది విద్యార్థులుండగా, నలుగురు ప్రధానోపాధ్యాయులు, 29 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రాథమికోన్నత పాఠశాలలో ఉర్దూ మీడియం కొనసాగుతోంది. మిగిలిన అన్నింటిలో తెలుగులోనే విద్యా బోధన జరుగుతోంది.మొత్తం విద్యార్థులు 352 ఈ బడులను కలిపి నిర్వహిస్తే కేవలం ఒక ప్రధానోపాధ్యాయుడు, ఏడుగురు ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా చేస్తే సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయుల కొరతను అధిగమించడంతో పాటు విద్యార్థులకు తరగతి గదుల సమస్య కూడా కొంతమేర తగ్గుతుంది. మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఐదు ఏజెన్సీలు పని చేస్తూ.. భోజనాన్ని అందిస్తున్నాయి. ఒకే ఏజెన్సీతో 352 మంది విద్యార్థులకు భోజనం వడ్డించే అవకాశాలున్నాయి. ఇవే కాకుండా ఇతర అనేక రకాల ఖర్చులను కూడా తగ్గించే అవకాశం ఉంది.పాఠశాలల వివరాలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 95 మంది విద్యార్థులుండగా, 6 నుంచి 10 తరగతుల వరకు బోధన జరుగుతోంది. పిల్లలకు బోధించేందుకు ఆరుగురు ఉపాధ్యాయులుండగా, ప్రధానోపాధ్యాయుడు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతుల్లో 55 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు, ఏడుగురు ఉపాధ్యాయులుండగా, ఎలాంటి పోస్టులు ఖాళీ లేవు.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 89 మంది విద్యార్థులున్నారు. 6 నుంచి 10 తరగతులకు బోధన జరుగుతోంది. ప్రధానోపాధ్యాయుడితో పాటు ఏడుగురు ఉపాధ్యాయులుండగా, ఎలాంటి ఖాళీ పోస్టులు లేవు.ఉర్దూ మీడియంలో కొనసాగుతున్న ప్రాథమికోన్నత బడిలో కేవలం 24 మంది విద్యార్థులున్నారు. మొత్తం 7 తరగతులున్నాయి. ఇందులో 1, 3, 6 తరగతుల్లో తరగతికి ఇద్దరేసి విద్యార్థులు మాత్రమే ఉన్నారు. 2, 5, 7 తరగతుల్లో నలుగురు చొప్పున ఉన్నారు. 5, 7 తరగతుల్లో ఐదుగురున్నారు. వీరి కోసం ముగ్గురు ఉపాధ్యాయులున్నారు. ఈ పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదనేది విద్యార్థుల సంఖ్యను బట్టి స్పష్టమవుతోంది. గత కొన్నేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉంది.ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 89 మంది పిల్లలున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులకు బోధిస్తుండగా ప్రధానోపాధ్యాయుడితో పాటు ఆరుగురు ఉపాధ్యాయులున్నారు.



# నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

3


# నిమజ్జనోత్సవం..మార్గం సిద్ధం



2

## గణేష్ మండపం వద్ద 51 కేజీల గణపతి లడ్డు లక్కీ డ్రా

### ముఖ్య అతిథిగా హాజరైన కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్







**కాటారం,సెప్టెంబర్ 16 నవభూమి ప్రతినిధి:** కాటారం మండల కేంద్రం లోని గారెపల్లి గ్రామ లక్ష్మీ దేవర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద స్వయంకృషి స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకుడు కొట్టే సతీష్ ఆద్వర్యంలో 51 కేజీల లడ్డూను స్వామి వారికి నైవేద్యంగా పెట్టారు. అయితే ఈ లడ్డు వేలం పాట పెడితే డబ్బులు ఉన్నవారు మాత్రమే చేజిక్కించుకుంటారు అనే ఒక మంచి ఆలోచనతో సామాన్య మానవునికి కూడా అందుబాటులో ఉండాలనే విధంగా లక్కీ డ్రా సిస్టమ్ ద్వారా టికెట్ ధర 10/- పెట్టడంతో చాలా మంది ఈ లక్కీ డ్రా లో పాల్గొన్నారు. నవరాత్రుల్లో తొమ్మిది రోజులు పూజలు నిర్వహించిన గణపతి ప్రసాదం 51 కేజీల లడ్డూను నిమజ్జనం రోజు సోమవారం ఉదయం కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్ చేతుల మీదుగా లక్కీ డ్రా తీశారు.లక్కీ డ్రా విన్నర్ గా జనగామ కిరణ్ కుమార్ 51 కేజీల లడ్డూను చేజిక్కించుకున్నాడు. ఆలయ అర్చకులు స్వామి వారి లడ్డూను డ్రా విజేత జనగామ కిరణ్ కుమార్ కు అందజేశాడు. ఈ కార్యక్రమంలో కాటారం ఎస్ఐ అభినవ్, స్వచ్ఛంధ సంస్థ సభ్యులు,ఉత్సవ కమిటీ సభ్యులు,గ్రామస్తులు,మహిళలు,లక్కీ డ్రా మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనోత్సవం..

# మార్గం సిద్ధం



**వరంగల్ –నవభూమి:** మహా నగరంలో సోమవారం జరగనున్న గణేశ్ నిమజ్జనానికి సర్వం సిద్ధమైంది. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 21 చెరువుల వద్ద సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాట్లు చేశారు.వరంగల్ మహా నగరపాలక సంస్థ, సాగునీటిపారుదల శాఖ, రెవెన్యూ, మత్స్య శాఖ, దేవాదాయ, రహదారులు, భవనాలు, పోలీసుశాఖలు భాగస్వాములయ్యాయి. ప్రభుత్వ శాఖల వారీగా కేటాయించిన పనులు ఆదివారం సాయంత్రం వరకు పూర్తి చేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే, పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పనులు తనిఖీ చేశారు. గతేడాది గ్రేటర్ పరిధిలో 3850 పైచిలుకు విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఈ ఏడాది 4 వేల పైనే వస్తాయని అధికారులు అంచనా.21 చెరువులు.. రూ.2 కోట్ల వ్యయం వరంగల్ ప్రాంతం చెరువులు: దేశాయిపేట చిన్న వడ్డేపల్లి 7 క్రేన్లు, ఉర్సు రంగసముద్రం 3, ఖిలావరంగల్ అగుర్తు 1, రంగశాయిపేట బెస్తం చెరువు 1, మామునూరు చెరువు 1, గొర్రెకుంట కట్టమల్లన్న 1.హనుమకొండ ప్రాంతంలో..: కాజీపేట బంధం చెరువు 4 క్రేన్లు, హనుమకొండ సిద్ధేశ్వర గుండం 3, హసన్‌పర్తి పెద్ద చెరువు 2, మడికొండ 1, భీమారం 1.ఏర్పాట్లు ఇలా 21 చెరువుల వద్ద తాగునీటి సరఫరా, 24 గంటల పాటు పారిశుద్ధ్య పనులు, విద్యుద్దీపాలు, సీసీ కెమెరాలు, ఇంధనం, జనరేటర్లు, భోజనం తదితర ఏర్పాట్లను గ్రేటర్ వరంగల్ చేస్తోంది.28 భారీ క్రేన్లను ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు చెరువుల వద్ద తెప్పలు, గజ ఈతగాళ్లు (మత్స్యశాఖ) చెరువుల చుట్టూ బారీ కేడ్లు (ఆర్అండ్‌బీ) ః షామియానాలు (దేవాదాయ) ః విద్యుత్తు సరఫరా (టీఎస్ఎన్పీడీసీఎల్) బందోబస్తు (పోలీసు) 24/7 సేవలు గ్రేటర్ వరంగల్ అధికారులు, క్షేత్రస్థాయి ఉద్యోగులు 24/7 సేవలందించాలని కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. నోడల్ అధికారులు, ఇంజినీర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఈఈలు, డీఈలు, ఏఈలతో 21 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.చెరువుల వద్ద 1000 మంది పారిశుద్ధ్య కార్మికులు సేవలందించనున్నారు.28 క్రేన్లు..: వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని 21 చెరువుల వద్ద 28 క్రేన్లు ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్‌లో 15, హనుమకొండ 11, 02 రిజర్వులో ఉంటాయి.ట్రాఫిక్ మళ్లింపు ఇలా..ములుగు, భూపాలపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన వాహనాలు ఆరెపల్లి ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి వెళ్లాలి. భూపాలపల్లి, పరకాల నుంచి ఖమ్మంకు వెళ్లే వాహనాలు ఆరెపల్లి ఓఆర్ఆర్ నుంచి కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్ బంకు నుంచి వెళ్లాలి.భూపాలపల్లి, పరకాల నుంచి నర్సంపేటకు వెళ్లే వాహనాలు కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్‌పీరీలు, గొర్రెకుంట మీదుగా వెళ్లాలి.నగరంలోకి వచ్చే భారీ వాహనాలను శివారులోనే నిలిపివేస్తారు. నిమజ్జనం పూర్తయిన తర్వాత నగరంలోకి అనుమతిస్తారు.ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, సీపీవో జంక్షన్, అంబేడ్కర్ సెంటర్, శ్రీదేవి మాల్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి.హనుమకొండ బస్టాండ్ నుంచి ములుగు, కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలు శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సెంటర్, సీపీవో జంక్షన్ నుంచి కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లాలి.హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపు వెళ్లే వాహనాలు బాలసముద్రం, అదాలత్, హంటర్‌రోడ్డు మీదుగా వెళ్లాలి.వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలు చింతల్ వంతెన నుంచి రంగశాయిపేట మీదుగా నాయుడు పెట్రోల్‌బంకు, ఉర్సుగుట్ట, అదాలత్, బాల సముద్రం మీదుగా హనుమకొండకు చేరుకోవాలి. నిమజ్జనం తర్వాత..సిద్ధేశ్వర గుండంలో విగ్రహాల ను నిమజ్జనం చేసిన తర్వాత వాహనాలు శాయంపేట రోడ్డు మీదుగా వెళ్లాలి. ఆరడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలకు సిద్ధేశ్వర్ గుండంలో నిమజ్జనం ఉండదు. వీటిని చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జనం చేయాలి.శాయంపేట నుంచి వచ్చే వాహనాలు హంటర్‌రోడ్డు, అదాలత్, హనుమకొండచౌరస్తా మీదుగా వెళ్లాలి.కోట చెరువులో నిమజ్జనం కోసం వెళ్లే వాహనాలు పెద్దమ్మగడ్డ, ములుగురోడ్డు జంక్షన్, ఎంజీఎం, ఆటోనగర్‌ల మీదుగా కోటచెరువుకు వెళ్లాలి.ఎక్సైజ్, రెవెన్యూకాలనీ, వడ్డెపల్లి ప్రాంతాల నుంచి వచ్చే వినాయక విగ్రహాలను బంధం చెరువులో నిమజ్జనం చేయాలి.చిన్నవడ్డెపల్లి చెరువులో నిమజ్జనం చేసే వాహనాలు ఎనుమాముల మార్కెట్ నుంచి కాశీబుగ్గ మీదుగా వెళ్లాలి.కోట చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత వాహనాలు హనుమాన్ జంక్షన్, పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 16న వినాయక విగ్రహాల నిమజ్జనానికి పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నిమజ్జనం జరిగే బంధం చెరువు, ఉర్సుగుట్ట చెరువు, చిన్న వడ్డెపల్లి, సిద్ధేశ్వరగుండం, హసన్‌పర్తి చెరువుల వద్ద సుమారు 2500 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్తు దీపాలు, సీసీ కెమెరాలు, నాణ్యమైన క్రేన్లు, కంట్రోల్ గదులను ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తారు. గజ ఈతగాళ్లను సైతం సిద్ధం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. నిమజ్జనానికి వచ్చే, వెళ్లే వాహనాలను వేర్వేరు మార్గాల్లో పంపిస్తారు. అనుమతి లేని చెరువుల్లో నిమజ్జనం చేయవద్దని పోలీసులు సూచించారు. విగ్రహాలను తరలించే వాహనాలకు ఇబ్బంది కలగకుండా నగరంలో 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి 17వ తేదీ ఉదయం 10 గంటల వరకు ట్రాఫిక్‌ను మళ్లిస్తారు.

# కేటిపీపీ పైప్ లైన్ లీకేజీ వరద మళ్లింపు

### నవభూమి కథనానికి స్పందన



**కాటారం,సెప్టెంబర్ 16 నవభూమి ప్రతినిధి:**నెల రోజులుగా పైప్ లైన్ లీకేజీ – పట్టించుకోని అధికారులులి సోమవారం నవభూమి పత్రిక కథనానికి స్పందించిన కాటారం గ్రామ పంచాయతీ కార్యదర్శి శకీర్ ఖాన్ జేసిబి సహాయంతో ,గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పైప్ లైన్ లీకేజీ వాటర్ రహదారి వైపు రాకుండా,ఇండ్ల ముందుకు రాకుండా చర్యలు చేపట్టి డ్రైనేజీ లకు నీరు వెళ్ళేవిధంగా జేసిబి తో క్లియర్ చేసి నీటి వరదను డ్రైనేజీ లోకి మళ్లించారు.దీనితో లీకేజీ వాటర్ రహదారి పై రాకుండా చేసారు.పైప్ లైన్ మరమ్మతులు మాత్రం కాలేదు.పైప్ లైన్ లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.కేటిపీపీ పైప్ లైన్ కాబట్టి కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ కు సంబంధించిన అధికారులు స్పందించి పైప్ లైన్ కు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

# ఉన్నత చదువులకు దూరవిద్య వరం

**జనగామ నవభూమి ప్రతినిధి:** రెగ్యులర్ డిగ్రీతో సమానంగా దూరవిద్య(ఓపెన్ డిగ్రీ) ద్వారా అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని జనగామ ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సమన్వయకర్త అనగాని శ్రీనివాస్ అన్నారు.ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు నేరుగా ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు పొందవచ్చని సూచించారు. ఈ విశ్వవిద్యాలయం అందిస్తున్న విద్యావకాశాలు, ప్రవేశాలకు సంబంధించిన మరిన్ని విషయాలపై ఆదివారం 'న్యూస్‌టుడే' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించగా విశేష స్పందన లభించింది. ఈ మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం పలువురు తమ సందేహాలను పంచుకున్నారిలా..ప్రశ్న: దూరవిద్యలో ఇంటర్ చదివాను. ఇప్పుడు ఓపెన్ డిగ్రీ చదవాలనుకుంటున్నాను. ఎప్పటివరకు దరఖాస్తు చేసుకోవాలి?.. ఏఏ సర్టిఫికెట్లు కావాలి?..గిరిరాజుల కవిత, చౌడారం జవాబు: ఈ నెల 30 వరకు ప్రవేశాలకు అవకాశం ఉంది. ఓపెన్ ఇంటర్ మెమో, స్టడీ, కుల ధ్రువీకరణపత్రాలు, రెండు ఫొటోలు అవసరమవుతాయి.ఆన్‌లైన్‌లో పీజీ కోసం దరఖాస్తు చేశాను. కానీ ఫీజు చెల్లింపు జరగడం లేదు?..– హైమావతి, పాలకుర్తి దరఖాస్తు చేసిన విశ్వవిద్యాలయానికి మీ ఒరిజినల్ సర్టిఫికేట్లతో వెళ్లి సంప్రదిస్తే మేలు. ఓపెన్ డిగ్రీలో ఉత్తీర్ణుడయ్యాను. సర్టిఫికెట్లు ఎలా తీసుకోవాలి?.. – బాలరాజు, బచ్చన్నపేట ఏదేని ఆన్‌లైన్ నెట్ సెంటర్‌కు వెళ్లి విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుంటే పోస్టు ద్వారా సర్టిఫికెట్స్ పంపిస్తారు. మాది బచ్చన్నపేట. కానీ మేము హైదరాబాద్‌లో ఉంటున్నాం. స్టడీ సెంటర్‌లో ప్రవేశం పొందాలా?.. ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చా ?..మచ్చ సందీప్‌కుమార్ ఆన్‌లైన్‌లో ఏ అధ్యయన కేంద్రంలోనైనా ప్రవేశం పొందవచ్చు. కానీ మీ అడ్మిషన్ నిర్ధారణ కావాలంటే ఎంచుకున్న కేంద్రాన్ని సందర్శించి ధ్రువపత్రాలను పరిశీలింపజేసుకోవాలి. బీ.ఏ మొదటి సంవత్సరంలో చేరాలనుకుంటున్నాను. చదువుకోడానికి పుస్తకాలు ఇస్తారా ?..ధరావత్ జమున, దర్దేపల్లి జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఆనక ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తాం. పుస్తకాలకు తగిన రుసుం చెల్లిస్తే చిరునామాకు పంపిస్తారు.చాలారోజులకు మెమోలు జారీ చేస్తున్నారు?.. త్వరగా రావాలంటే ఎలా?..సరిత, నిడిగొండ దరఖాస్తు చేసుకున్న నెల లేదా రెండు నెలలకు సర్టిఫికెట్లు వస్తాయి. అత్యవసరమైతే నేరుగా విశ్వవిద్యాలయానికి వెళ్లి రూ.600–700 చెల్లిస్తే రెండు రోజుల్లో సంబంధిత మెమోలను అందజేస్తారు.ఈ కోర్సుకు ఫీజు ఎంత ఉంటుంది?..నస్రీన్, జనగామ ఫీజు కనిష్ఠంగా రూ.3200 ఉంటుంది. మీరు ఎంచుకునే సబ్జెక్టులకు అనుగుణంగా ఫీజులు ఉంటాయి.ఒకసారి దూరవిద్య డిగ్రీలో చేరిన తర్వాత గ్రూపు కానీ, సబ్జెక్టు గానీ మార్చుకునే అవకాశం ఉంటుందా?.. రజిత, వరంగల్ మీరు తీసుకున్న సబ్జెక్టుల్లో అనుత్తీర్ణులైతే రెండో సంవత్సరంలో మార్చుకోవచ్చు. కానీ మళ్లీ మొదటి సంవత్సర సెమిస్టర్ పరీక్షలను రాయాల్సి ఉంటుంది.కోర్సులో చేరితో ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలా?.. నకలు ఇవ్వాలా?..రాకేశ్, జనగామ రెండు సెట్ల సంబంధిత నకలు పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. కాకపోతే మీరు ఫీజు చెల్లించాలంటే ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉంటుంది.

## భక్తి శ్రద్ధలతో గణేష్

# శోభయాత్ర ,నిమజ్జనం











**కాటారం,సెప్టెంబర్ 16 నవభూమి ప్రతినిధి:** కాటారం మండలం లోని పలు గ్రామాలలో వీధి వీధిన ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల్లో గణపతికి పది రోజులు తొమ్మిది రాత్రులు అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమ పూజలు,సరస్వతి పూజలు నిర్వహించి, మండపాల వద్ద మహా అన్నదానాలు ఘనంగా నిర్వహించారు.పదవ రోజు సోమవారం రోజున గణపతి మండపాల వద్ద ఉద్వాసన చేసి ఉదయం పూజతో గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు చేశారు.సోమవారం ఉదయం నుండి రాత్రి వరకు వాహనాలలో భారీ ఊరేగింపు తో కోలాటాలు, నృత్యాలు చేస్తూ స్వామి వారి శోభాయాత్ర ను అంగరంగ వైభవంగా నిర్వహించారు.శోభాయాత్ర అనంతరం ఊరేగింపుగా వాహనాలలో కాళేశ్వరం త్రివేణి సంగమం లో నిమజ్జనం చేసారు. సోమవారం కొన్ని మండపాల వద్ద మహా అన్న ప్రసాద వితరణ చేశారు.పెద్ద సంఖ్యలో మహిళలు మంగళ హారతులతో స్వామి వారి ముందు శోభాయాత్ర లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. యువకులు కలర్స్ చల్లుకుంటూ,నృత్యాలు చేస్తూ బాణా సంచ పేల్చుతూ స్వామి వారిని సాగనంపారు.గణపతి బప్పా మోరియా అనే నినాదాల తో రహదారులన్నీ మారు మ్రోగాయి.పిల్లలు,పెద్దలు తేడా లేకుండా నృత్యాలు చేస్తూ స్వామి వారి శోభాయాత్ర నిర్వహించారు.

# నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

**తొర్రూరు, నవభూమి ప్రతినిధి:**రాష్ట్రాభివృద్ధి, నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.ఓ పని మీద ఖమ్మం వెళ్తున్న ఆయన మార్గమధ్యలో ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి ఆయన సతీమణి లక్ష్మీతో విచ్చేసి స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి దంపతులకు యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఝాన్సీరెడ్డిలు స్వాగతం పలికారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. పిన్న వయస్సులో ఎమ్మెల్యే అయిన యశస్వినిరెడ్డి అభివృద్ధిలో చొచ్చుకపోవడం అభినందనీయమన్నారు. పార్టీ నాయకులు తిరుపతిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, హమ్యానాయక్, రాజశేఖర్ పాల్గొన్నారు.

